నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 ఆదివారం 18 ఫిబ్రవరి 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మహిళలు, చిన్నారుల సంరక్షణకే భరోసా కేంద్రం



భరోసా కేంద్రం సేవలను వివరిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి17 : మహిళలు, చిన్నారల సంరక్షణకే భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అడిషనల్ డీజీపీ, ఉమెన్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో సేవలు అందుతాయని, మహిళలు, యువతులు, బాలికలకు ఏదైనా జరిగితే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. డీఎస్పీ సదయ్య, టాస్క్‌ఫోర్స్ , స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణా ప్రతాప్, డీసీఆర్బీ సీఐ రమేశ్, పట్టణ సీఐ సతీష్, ఎస్ఐ రాజ్యలక్ష్మి, ఆర్ఎస్ఐ రాజేశ్, షీ టీమ్ ఇన్‌చార్జిలు సునీత, శ్రీనివాస్, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ తాగు నీరు సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా పైపులు పగిలితే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఉమర్ హుస్సేన్, భగీరథ ఈఈ వెంకటపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మంచిర్యాలలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు


ఆసిఫాబాద్ : బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు..


బెల్లంపల్లి : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# జన నేతకు దీవెనలు

### ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు

- బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్‌లు
- నిరుపేదలకు అన్నదానం.. రోగులకు పండ్లు పంపిణీ
- గనులు, ప్రధాన చౌరస్తాల్లో నినాదాల హోరు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కు

*జనహృదయ నేత, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలను శనివారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. సకల జనులు పాల్గొని భారీ కేకులు కట్‌చేసి.. మిఠాయిలు పంచిపెట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరుపేదలకు అన్నదానం చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సింగరేణి గనులు, ప్రధాన చౌరస్తాలు, పార్టీ కార్యాలయాల వద్ద జై కేసీఆర్.. నినాదాలతో హోరెత్తించారు. పలుచోట్ల మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు తదితరులు హాజరై.. తమ ప్రియతమ నేత కేసీఆర్.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకున్నారు.*


డీఎంహెచ్‌వో సాక్షిగా ప్రాజెక్టు ఆఫీసర్ ఫయాజ్ ఖాన్ వాహనం వద్ద 104 డ్రైవర్


వాహనాన్ని స్వయంగా డ్రైవ్ చేస్తూ వెళ్తున్న ఫయాజ్ ఖాన్

## హైర్ వెహికిల్‌కు అంబులెన్స్ డ్రైవర్

- తన వాహనానికి '104' డ్రైవర్‌ను వాడుకుంటున్న పీవో
- అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారి
- నిబంధనలకు విరుద్ధమేనన్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి(పీవో)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఫయాజ్ ఖాన్ అధికార దుర్వినియోగానికి యథేచ్ఛగా పాల్పడుతున్నారు. ఆయన తిరిగే కిరాయి వాహనానికి ప్రతినెలా ప్రభుత్వం నుంచి రూ.33 వేల బిల్లు వస్తుంది. ఇందులోనే వాహన డీజిల్ ఖర్చుతో పాటు డ్రైవర్ జీతం కూడా ఉంటుంది. కానీ ప్రైవేట్ డ్రైవర్‌ను పెట్టుకోకుండా 104 అంబులెన్సు నడిపే డ్రైవర్‌నే వాడుకుంటున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేస్తున్నప్పటి నుంచి ఈ తతంగం నడుస్తోంది. ఈ విషయం తెలిసి 'నమస్తే తెలంగాణ' శనివారం నిఘా పెట్టింది. ఫొటోలు తీస్తున్నట్లు గుర్తించిన ఫయాజ్‌ఖాన్ తన వాహనంలో ఉన్న 104 డ్రైవర్‌కు ఫోన్ చేసి అలర్ట్ చేశాడు. దీంతో సదరు డ్రైవర్ వాహనం వదిలేసి వెళ్లాడు. అనంతరం కొంతసేపటికి ఫయాజ్ ఖాన్ వచ్చి ఆ వాహనాన్ని తానే స్వయంగా నడుపుకుంటూ వెళ్లారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో సుబ్బారాయుడిని సంప్రదించగా.. 104 అంబులెన్స్ డ్రైవర్‌ను వాడుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. కానీ ఆయనకు తెలిసే ఫయాజ్‌ఖాన్ ఆగడాలు సాగుతున్నాయంటూ డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది కోడైకూస్తున్నారు. ఈ విషయమై డాక్టర్ ఫయాజ్‌ఖాన్ స్పందిస్తూ ఆరు నెలలుగా వాహనానికి సంబంధించిన బిల్లులు రావడం లేదని, కిరాయికి ఇచ్చిన యజమాని వాహనం నడుపడం కుదరదంటే.. రెండు నెలలుగా డీజిల్ పోసుకుంటూ డీఎంహెచ్‌వో కార్యాలయానికి కేటాయించిన ఐదుగురు డ్రైవర్లలో ఒకరిని వాడుకుంటున్నానని చెప్పారు. 104 అంబులెన్సు వాహన డ్రైవర్‌కు కూడా జీతం రావడం లేదని తెలిపారు.

### 'నిద్రావస్థలో వైద్యారోగ్యశాఖ'పై

## డీఎంహెచ్‌వో సీరియస్




- మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్
- ఉదయం 9 నుంచి సాయంత్ర 4 గంటల దాకా విధుల్లో ఉండాలని ఆదేశం


నిద్రావస్థలో వైద్యారోగ్యశాఖ

'నమస్తే'లో ప్రచురితమైన కథనం

మంచిర్యాల, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'నిద్రావస్థలో వైద్యారోగ్యశాఖ' శీర్షికన నమస్తే తెలంగాణలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆ శాఖలో కదలికవచ్చింది. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని నమస్తే స్పెషల్ విజిట్‌లో తేలగా, దీనిపై వైద్యారోగ్యశాఖ డైరెక్టర్.. జిల్లా వైద్యాధికారిని వివరణ కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. డైరెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు శనివారం ఉదయం మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా మెడికల్ ఆఫీసర్లకు ఫోన్ చేసి ఏ సమయానికి వెళ్లారంటూ ఆరాతీశారు. కొందరు డాక్టర్లు 9.30 నుంచి 10 గంటల మధ్యలో వచ్చినట్లు చెప్పడంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఓవైపు పత్రికల్లో సమయపాలన పాటించడం లేదని వార్తలు వస్తున్నా.. మార్పు ఎందుకు రావడం లేదని వారిపై మండిపడినట్లు తెలిసింది. రేపటి నుంచి ప్రతి మెడికల్ ఆఫీసర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల దాకా తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు. బయోమెట్రిక్ లేదా ఫేషియల్ యాప్‌లో కచ్చితంగా అటెండెన్స్ వేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. 9 గంటల నుంచి 2 గంటల వరకు దవాఖానలో ఓపీ, ఇతర పనులు చేసుకొని, 2 గంటల నుంచి 4 గంటల వరకు ఏదైనా సబ్‌సెంటర్‌ను విజిట్ చేయాలని చెప్పారు. ఈ మేరకు ఫొటోలను తనకు వాట్సాప్ పెట్టాలని సూచించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

### పుట్టగొడుగుల్లా

## మెడికల్ ఏజెన్సీలు

**రూ.20 వేలు ఇస్తే నిబంధనలు పాటించకున్నా ఓకే..**

- ఒక్క మంచిర్యాల జిల్లా కేంద్రంలోనే 130 నుంచి 150..
- శ్రీరామ్ మెడికల్ ఏజెన్సీలో నకిలీ మందుల పట్టివేత
- తనిఖీల్లో గుర్తించి సీజ్ చేసిన డ్రగ్ కంట్రోలర్ అధికారులు
- పట్టించుకోని జిల్లా ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్



మూసి ఉన్న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, కార్యాలయం డోర్‌పై రాసి ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 17 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ మాఫియా కోరలు చాస్తున్నది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మెడికల్ ఏజెన్సీలు అనుమతులు లేని ఔషధాలు విక్రయిస్తున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.20 వేలు ముట్టచెబితే చాలు నిబంధనలు పాటించకున్నా మెడికల్ ఏజెన్సీకి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క మంచిర్యాలలోనే 130 నుంచి 150 ఏజెన్సీలు ఉన్నాయంటే దందా ఎంత జోరుగా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. రెండు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించిన డ్రగ్ కంట్రోలర్ అధికారులు శ్రీరామ్ ఏజెన్సీలో నకిలీ మందులను గుర్తించారు. క్లింథియా 100 ఎంజీ(థయామిన్ హైడ్రోక్లోరైడ్ 100 ఎంజీ) ట్యాబ్లెట్లను సీజ్ చేశారు. బెరిబెరి, పెల్లగ్రా, వర్నికే-కోర్సాక ఆఫ్ సిండ్రోమ్, గర్భిణుల్లో రోగ నిరోధకశక్తిని పెంచేందుకు ఈ ట్యాబ్లెట్లను వాడుతారని తెలిసింది. ఇలాంటి తీవ్రమైన వ్యాధిగ్రస్తుల కోసం ఉపయోగించే ఈ ఔషధాన్ని డ్రగ్ లైసెన్స్ పొందిన కంపెనీలే తయారు చేసి విక్రయించాలి. కానీ.. అందుకు విరుద్ధంగా ఆహార ఉత్పత్తుల కింద అనుమతి తీసుకున్న హర్యానాలోని ఓ కంపెనీ తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నది. దానికి ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేదు. ఆ కంపెనీ తయారు చేసి ఈ మందులు మంచిర్యాలకు చెందిన ఏజెన్సీలో దొరకడం పెద్ద చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ ఔషధాలు విక్రయిస్తున్నట్లు తెలియడంతో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఆ క్రమంలోనే మంచిర్యాలలోనూ తనిఖీలు చేసినట్లు తెలిసింది.


**ఆ ఒక్క ఏజెన్సీలోనేనా..**

**ఇంకా ఎక్కడైనా చేశారా?**

రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేసిన డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మంచిర్యాల జిల్లాలో ఈ ఒక్క ఏజెన్సీలోనే తనిఖీలు చేశారా? లేక ఇంకా వేరే ఏజెన్సీల్లో ఏమైనా తనిఖీ చేశారా? అనేది తెలియదు. ఈ విషయంపై మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందనను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్ ఎత్తలేదు. మంచిర్యాలకు పూర్తి స్థాయి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పెద్దపల్లి జిల్లా అధికారిణికి ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. కానీ.. ఆమె నెలలో నాలుగు రోజులు కూడా కార్యాలయానికి రారని తెలిసింది. ఎప్పుడు చూసినా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి తాళం వేసే ఉంటున్నది. సిబ్బంది, అధికారులు ఎవ్వరూ కనిపించరు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పట్టింపులేని తనంతోనే జిల్లాలో మెడికల్ మాఫియా ఇష్టారాజ్యంగా నడుస్తున్నది. జిల్లాలో మెడికల్ ఏజెన్సీ పెట్టుకోవాలంటే రూ.20 వేలు ముట్టచెప్పుకోవాల్సి ఉంటుంది. కుమార్ అనే వ్యక్తి (ఈయన్నీ డీఐ అసిస్టెంట్ అని ప్రచారం చేశారు). కానీ.. వాస్తవానికి ఈయన మెడికల్ అండ్ డ్రగ్ ఏజెన్సీల యూనియన్‌లో ఓ క్లర్క్. డబ్బుల వసూలు చేయడం అప్పగించడం ఈయన పని. మెడికల్ ఏజెన్సీకి పర్మిషన్ కావాలంటే ముందు యూనియన్‌ను సంప్రదించాలి. వాళ్లు కుమార్‌కు ఫైల్ అప్పగిస్తారు. ఆయనే ఆన్‌లైన్ చేసి డబ్బులు తీసుకుంటారు. నిజానికి ఆన్‌లైన్‌లో ఏజెన్సీ లేదా మెడికల్ షాపు లైసెన్స్ కోసం రూ.3,060 డీడీ తీయాలి. అది కాకుండా అసోసియేషన్ సభ్యత్వం కోసం రూ.2,500 చెల్లించాలి. ఈ లెక్కన మొత్తం రూ.5,560 చెల్లిస్తే సరిపోతుంది. కానీ.. యూనియన్‌లోని కొందరు నాయకులు రూ.20 వేలు ఇస్తే అన్ని వాళ్లే చూసుకుని లైసెన్స్ ఇప్పిస్తారు. ఈ రూ.20 వేలలో నాయకులకు ఇంత, అధికారులకు ఇంత అని వాటా ఉంటుందని తెలిసింది. అధికారులు చొరవ తీసుకొని మెడికల్ ఏజెన్సీలపై దృష్టి సారించకపోతే ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా.. లేదా అనేది వేచి చూడాలి.

## బ్రహ్మోత్సవాలకు వేళాయే

- ముస్తాబైన సత్యదేవుడి గూడెం ఆలయం
- నేటి నుంచి 25వ తేదీ వరకు కార్యక్రమాలు
- 21న స్వామివారి కల్యాణం


గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం, గుట్టపై కొలువైన స్వామివారు

దండేపల్లి, ఫిబ్రవరి 17 : దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. నేటి ఆదివారం నుంచి ప్రారంభమై.. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనుండగా, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 21న గోధూళిక సుముహూర్తాన సత్యనారాయణస్వామి కల్యాణం, 24న మాఘశుద్ధి పౌర్ణమిన జాతర నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఆలయంలో నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, విశ్వక్సేనారాధన, దీక్ష కంకణాధారణ, నిరంతర సప్తాహ భజనలు, 21న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, వాసుదేవ పుణ్యాహహచనము, విశ్వక్సేనారాధన, రుత్విగ్వరణమ్, అంకురార్పరణం, పటాధివాసమం, ధ్వజారోహణం, సాయంత్రం 5 గంటలకు కల్యాణ మహోత్సవం, 22న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్టి, హవనం, స్థాళీపాక, పంచసూక్త హోమములు, బలిహరణము, నిత్య హోమములు, 23న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్టి, నవగ్రహ హోమము, పంచసూక్త హోమమములు, బలి హరణము, నిత్యహోమములు, 24న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్టి, హవనం, నిత్యహోమములు, జయాదిహోమం, శాంతి హోమం, మహాపూర్ణాహుతి, బలిహరణము, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి సేవా ఉత్సవం, 25న స్వామి వారి రథోత్సవం, సప్తాహ భజన, పరిసమాప్తము, ఏకాంత సేవాతో స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలు ముగుస్తాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. కల్యాణం అనంతరం అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

**ఏర్పాట్లు పూర్తి..**

స్వామి వారి కల్యాణం సందర్భంగా ప్రధాన ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. సత్యనారాయణస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారి కల్యాణం కోసం భక్తులు రూ.500 కల్యాణం రుసుం చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుంది. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు.

## కొత్త గనులకు సహకారమందిస్తాం

- బొగ్గు, విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి భేష్
- కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా
- సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి ఎస్టీపీపీ సందర్శన
- శ్రీరాంపూర్ ఓసీపీపై ఏకో పార్కు ప్రారంభం


ఎస్టీపీపీలో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంటును సందర్శించిన అమ్రిత్ లాల్ మీనా

జైపూర్, ఫిబ్రవరి 17 : సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం చేపట్టనున్న కొత్త గనులకు పూర్తి సహకారమందిస్తామని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా (ఐఏఎస్) పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని ఎస్టీపీపీని సీఎండీ బలరాం నాయక్‌తో కలిసి సందర్శించారు. ఎస్టీపీపీ ప్లాంటు, 5 మెగావాట్ల సోలార్ ప్లాంటు, 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్‌లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోలార్‌ప్లాంట్లపై ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు, విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో ముందుండడం అభినందనీయమని కొనియాడారు. సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రం కూడా దేశంలోని అగ్రగామి సంస్థలతో పోటీ పడుతూ ఉత్పత్తి సాధిస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల తర్వాత మరోసారి సింగరేణి ప్రాంతాన్ని సందర్శిస్తానని తెలిపారు. అనంతరం సీఎండీ బలరాం నాయక్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకులను తమ సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న కాలంలో కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. దీనిపై శ్రీ అమ్రిత్‌లాల్ మీనా స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగేలా తన సహకారాన్ని అందిస్తానని, సింగరేణి భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అమ్రిత్‌లాల్ మీనా ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కోఆర్డినేషన్ సురేశ్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్టీపీపీ ఈడీ బస్విరెడ్డి, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జైన్ సింగ్, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ 2 జీఎం సూర్యనారాయణ, మందమర్రి జీఎం మనోహర్, చీఫ్ ఆఫ్ పవర్‌ప్రాజెక్ట్స్ విశ్వనాథ రాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఓబీలపై సోలార్, హైడల్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి**

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 17 : సింగరేణి ఖాళీ స్థలాలు, మట్టి గుట్టల(ఓబీ)పై వీలైనన్ని సోలార్ ప్లాంట్లు, హైడల్ పవర్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఇండియా సెక్రటరీ అమ్రిత్‌లాల్ మీనా కోరారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీపై సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావుతో కలిసి ఏకో పార్కును ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. అమ్రిత్‌లాల్ మీనా మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధికి కోల్‌మైన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీఎంపీడీసీఐ) సహకారంతో ముందుకెళ్లాలన్నారు. చెరువులు, నదుల నుంచి నీటి ని మట్టి గుట్టల(ఓబీ)లపైకి ఎత్తిపోసి టర్బైన్‌ల ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఓసీపీ క్వారీని వ్యూపాయింట్ నుంచి పరిశీలించారు. జీఎం కో ఆర్డినేషన్ ఎం సురేశ్, జీఎం సంజీవ రెడ్డి, సీఎంవోఏఐ ప్రధా న కార్యదర్శి పెద్ది నర్సింహులు, శ్రీరాంపూర్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూ సీ అధ్యక్షుడు సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, పీవోలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, సివిల్ జీఎం జేవీఎల్ గణపతి, ఏజీఎం మురళీధర్, డీవైజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, గోపాల్‌సింగ్, ఏవీ రెడ్డి, రాముడు పాల్గొన్నారు.